



sahanamvande.com

# సహనం వందే

epaper.sahanamvande.com

హైదరాబాద్ | 07-07-2026 మంగళవారం | సంపుటి-02 సంచిక : 96 EDITOR: ROHINI





# అక్కడ ఉరి... ఇక్కడ గారడీ




## అవినీతికి చైనాలో మరణదండన




- మన దేశంలో ఏళ్ళకొద్దీ జాప్యం
- మాజీ అధికారికి చైనా మరణశిక్ష
- 300 కోట్లు తిన్న డీఎస్పీ భీమ్‌రెడ్డి అరెస్ట్
- సరైన శిక్షలు లేకపోవడంతో ఇష్టారాజ్యం

**అధికారం చేతిలో ఉంది కదా అని విచ్చలవిడిగా సంపాదిస్తే ఏమవుతుంది? చైనాలో అయితే ఉరికొయ్యే గతి. కానీ మన దేశంలో మాత్రం అడ్డంగా దొరికిపోయినా బెయిలుతో బయటపడటం పరిపాటిగా మారింది. ప్రజాధనాన్ని దోచుకుంటున్న అధికారుల తీరు వ్యవస్థకు పట్టిన చీడలా మారుతోంది. చైనా, భారత్ మధ్య అవినీతిపై పోరులో ఉన్న వైరుధ్యమే ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చకు దారితీస్తోంది. - సహనం వందే, హైదరాబాద్**

చైనాలో ఒక మాజీ అధికారి వందల కోట్ల రూపాయల లంచం తీసుకున్నారు. సోమవారం ఇది ఆ దేశ వ్యవస్థనే కుదిపేసే సంచలన వార్త. మన రాష్ట్రంలో భీమ్‌రెడ్డి అనే డీఎస్పీ స్థాయి అధికారి 300 కోట్ల రూపాయల అక్రమాస్తులు కూడగట్టారు. అంతే కాదు తెలంగాణ రాష్ట్రంలో ఇటీవల అవినీతి కేసుల బండారం బట్టబయలు అవుతుంది. ఒక అధికారి 100 కోట్లు, మరో అధికారి 200 కోట్లు... ఇలా వందల కోట్ల అవినీతి అనేది చాలా చిన్న విషయంగా మారింది. రెండు దేశాల్లోనూ అవినీతి ఉన్నా దాన్ని చూసే కోణంలో మాత్రం ఆకాశానికి భూమికి ఉన్నంత తేడా కనిపిస్తోంది.

### అధికారుల ఆశల గోదాములు

చైనా మాజీ అధికారి రోజుకు లక్షల రూపాయలు లంచం తీసుకున్నా ఆశ తీరలేదు. వందల కోట్ల రూపాయలు అంటే ఒక చిన్న సామ్రాజ్యాన్ని నిర్మించవచ్చు. డబ్బు దాచడానికి బ్యాంకుకు బదులు గోదాముల్నే వాడారని అర్థమవుతోంది. వ్యవస్థను మేనేజ్ చేస్తూ దశాబ్దాల పాటు ఈ దోపిడీని కొనసాగించారు. భీమ్‌రెడ్డి కూడా పక్కా ప్లాన్‌తో 300 కోట్ల రూపాయల ఆస్తులను అడ్డదారిలో సంపాదించారు. అనధికారికంగా వెయ్యి కోట్లు సంపాదించాడని ప్రచారం జరిగింది.

### అక్కడ ఉరి... ఇక్కడ సిరి

చైనాలో ఆ అధికారికి అక్కడి న్యాయస్థానం మరణశిక్ష విధించింది. చిన్న శిక్షలు వేస్తే ఎవరూ భయపడరని, వ్యవస్థను శుద్ధి చేయాలంటే కఠినత్వమే మార్గమని భావించింది. మన దగ్గర భీమ్‌రెడ్డిని ఏసీబీ అరెస్ట్ చేసింది. కానీ తర్వాత ఏమవుతుందన్నది అందరికీ తెలిసిందే. కేసులు ఏళ్ల తరబడి సాగడం, సాక్ష్యాధారాలు లేక నిందితులు బయటపడటం మన వ్యవస్థలో సాధారణం. శిక్ష పడటానికంటే తప్పించుకోవడానికే ఇక్కడ ఎక్కువ అవకాశాలు ఉన్నాయి. అవినీతి చేస్తే మహా అయితే జైలుకు పంపిస్తారు... అంతకుమించి చేసేది ఏమీ కాదు కదా అన్న ధైర్యం అక్రమార్కుల్లో నెలకొనడం ఈ పరిస్థితికి కారణం.

### ప్రజల రక్తాన్ని దోచేస్తూ

సామాన్యుడు కష్టపడి కట్టే పన్నులతోనే ఈ అధికారులు విలాసాలు చేస్తున్నారు. 300 కోట్ల రూపాయల భీమ్‌రెడ్డి ఆస్తులు అడ్డంగా సంపాదించడం నిజంగా సిగ్గుచేటు. బాధ్యతాయుతమైన పదవిలో ఉండి ప్రజలకు రక్షణ ఇవ్వాల్సింది పోయి ఇలా అడ్డదారిలో సంపాదించడం వారి దోపిడీకి నిదర్శనం. ఇలాంటి వారు పదవుల్లో ఉన్నంత కాలం పేదలకు న్యాయం జరగడం అసాధ్యం. ఎన్ని అక్రమాలు చేస్తే ఇన్ని కోట్లు సంపాదించగలడు? ఇది మన రక్తాన్ని దోచుకోవడమేనని ప్రజలు విమర్శిస్తున్నారు.

### శిక్షలే అసలైన పరిష్కారం

మన వ్యవస్థలోని లోపం ఈ రెండు కేసుల్లో స్పష్టంగా కనిపిస్తోంది. శిక్షలు ఆలస్యంగా పడటం వల్లే అవినీతి ఒక అలవాటుగా మారింది. చైనాలో మాదిరిగా కఠిన శిక్షలు ఉంటే లంచం తీసుకోవడానికి ఎవరైనా పదిసార్లు ఆలోచిస్తారు. కేవలం అరెస్టులు, సస్పెన్షన్లు మాత్రమే సరిపోవు. వ్యవస్థలను క్లీన్ చేయాలంటే కఠినమైన నిర్ణయాలు తీసుకోవాల్సిందేనన్న డిమాండ్ దేశవ్యాప్తంగా మొదలైంది.

### పారదర్శకతతోనే మార్పు

కేవలం మరణశిక్షలే పరిష్కారం కాకపోవచ్చు. పారదర్శకమైన పాలన, వేగవంతమైన న్యాయ విచారణ కూడా అవసరం. చట్టాల్లో ఉన్న లొసుగులను తొలగించి నిర్ణీత సమయంలోనే తీర్పులు వెలువడేలా చేయాలి. భీమ్‌రెడ్డి విషయంలో ఏసీబీ ఎలాంటి చర్యలు తీసుకుంటుందో వేచి చూడాలి. డబ్బు ఆ అధికారులకు ఏ మాత్రం ఉపయోగపడలేదు సరే కదా కన్నవాళ్లకు, కుటుంబానికి తీరని అవమానాన్ని మిగిల్చింది. అధికారం శాశ్వతం కాదు, చేసిన మంచి చెడులు మాత్రమే మిగులుతాయి.

# కళ్ల రంగు... కొత్త ట్రెండ్

## కళ్లు రంగు మార్చుకునే వెరైటీ సర్జరీ

- వైద్య రంగంలో సంచలనం
- ఫ్రాన్సిస్ ఫెరారీ ఆవిష్కరణ

**పుట్టుకతో వచ్చిన కళ్ల రంగును మార్చుకోవడం ఎప్పుడైనా ఊహించారా? ఇప్పుడు అది సాధ్యమే. ఆధునిక వైద్యం కళ్లకు కొత్త రంగులు అద్దుతోంది. ఫ్రాన్స్ దేశానికి చెందిన నేత్ర వైద్య నిపుణుడు ఫ్రాన్సిస్ ఫెరారీ సృష్టించిన ఈ విధానం ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. నచ్చిన రంగులో కళ్లు ఉండాలని కోరుకునే వారు ఇప్పుడు వెనకాడటం లేదు. - సహనం వందే, హైదరాబాద్**



ఫ్రాన్సిస్ ఫెరారీ 2013లో ఫెమ్టోసెకండ్ లేజర్ అసిస్టెడ్ యాన్యులర్ కెరాటోపిగ్మెంటేషన్ విధానాన్ని కనుగొన్నారు. దీనిని క్లుప్తంగా ఫ్లాక్ అని పిలుస్తారు. కంటి పాప రంగును మార్చడం దీని ప్రత్యేకత. కేవలం 30 నుంచి 45 నిమిషాల వ్యవధిలోనే ఈ ప్రక్రియ పూర్తవుతుంది. దీని కోసం కంటిలో ఎటువంటి ఇంప్లాంట్లు వేయరు.

### చిన్నపాటి సర్జరీ

ఈ సర్జరీలో ఫెమ్టోసెకండ్ లేజర్ సాయంతో కంటి కార్నియాలో ఒక చిన్న సొరంగం లాంటి మార్గాన్ని చేస్తారు. ఆ తర్వాత అందులోకి రంగును పంపిస్తారు. దీనివల్ల కంటి అసలు రంగు బయటకు కనిపించదు. స్థానిక అనస్థీషియాతోనే ఈ ప్రక్రియ చేస్తారు. కుట్లు వేయాల్సిన అవసరం అస్సలు ఉండదు. రోగి అదే రోజు ఇంటికి వెళ్ళిపోవచ్చు.

### కోరిన రంగులు

పిస్తా గ్రీన్ నుంచి ఓషన్ బ్లూ వరకు రకరకాల రంగులు అందుబాటులో ఉన్నాయి. ఆలివ్ గ్రీన్, హనీ గోల్డ్ ఇలా తమకు నచ్చిన రంగును రోగులు ఎంచుకోవచ్చు. ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా 1800 మంది ఈ సర్జరీ చేయించుకున్నారు. దీని కోసం 6.3 లక్షల రూపాయల వరకు ఖర్చు అవుతోంది.

### వివాదాల నీడ

ఈ సర్జరీపై వైద్య నిపుణులలో భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. కేవలం సౌందర్యం కోసం కంటిపై ప్రయోగాలు చేయడం ప్రమాదకరమని కొందరు వాదిస్తున్నారు. ఇన్ఫెక్షన్లు వచ్చే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. భవిష్యత్తులో ఏదైనా కంటి సమస్య వస్తే సర్జరీ చేయడం కష్టమని వైద్యులు ఆందోళన చెందుతున్నారు. ఇది శాశ్వత పరిష్కారం కాకపోవచ్చని కొందరి వాదన.

### భద్రతపై భరోసా

ప్రమాదకరమైన ఐరిస్ ఇంప్లాంట్ల కంటే ఇది చాలా సురక్షితమని ఫెరారీ చెబుతున్నారు. ఈ సర్జరీ వల్ల కంటికి ఎటువంటి హాని కలగదని ఆయన వాదిస్తున్నారు. గ్లకోమా వంటి సమస్యలు వచ్చే అవకాశం లేదని స్పష్టం చేశారు. ఇప్పటికే వేలాది మంది దీనిని చేయించుకొని సంతృప్తిగా ఉన్నారని ఆయన గణాంకాలు చెబుతున్నారు.

### కొత్త ఫ్యాషన్...

సౌందర్యం కోసం ఎంతటి రిస్క్ అయినా తీసుకోవడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారు. వ్యక్తిగత గుర్తింపు కోసం కళ్ల రంగు మార్చుకోవడం ఒక కొత్త ఫ్యాషన్ స్టేట్‌మెంట్‌గా మారింది. ఈ ట్రెండ్ ఎంతవరకు వెళ్తుందో వేచి చూడాలి. వైద్యపరంగా ఇది ఎంతవరకు సమర్థనీయమో భవిష్యత్తులో మరిన్ని పరిశోధనలు తేల్చాలి.

# గ్లోబల్ సీన్... పాస్‌పోర్ట్ డౌన్!

## 125వ స్థానం: ఇండియాకు ఘోర పరాభవం

**ప్రపంచ పటంలో భారత్ ముద్ర బలంగా ఉన్నా మన పాస్‌పోర్ట్ మాత్రం తన శక్తిని కోల్పోతోంది. విదేశీ ప్రయాణాల కోసం తహతహలాడే కోట్లాది మంది భారతీయులకు ఇప్పుడు వీసా నిబంధనలు పెద్ద చిక్కుముడిగా మారాయి. చిన్న దేశాలు సైతం మనకంటే మెరుగైన స్థానాల్లో ఉండటం దేశ దౌత్య, ఆర్థిక స్థితిగతులపై తీవ్రమైన చర్చకు దారితీస్తోంది. - సహనం వందే, హైదరాబాద్**

- గ్లోబల్ ఇండెక్స్- 2026 షాకింగ్ రిపోర్ట్
- చిన్న దేశాల కంటే వెనుకబడ్డ భారత్
- బాధ్యత లేని వలసలతో పెరుగుతున్న చిక్కు
- పవర్ తగ్గుతోంది.. పరువు పోతోంది




గ్లోబల్ పాస్‌పోర్ట్ ఇండెక్స్ వెల్లడించిన తాజా గణాంకాల ప్రకారం 2026లో భారత్ పాస్‌పోర్ట్ ర్యాంక్ 125వ స్థానానికి పడిపోయింది. గత ఏడాది హెన్లీ పాస్‌పోర్ట్ ఇండెక్స్‌లో 85వ స్థానంలో ఉన్న మన దేశం, ఒక్కసారిగా 125వ పడిపోవడం అత్యంత ఆందోళనకరమైన విషయం. మనకంటే తక్కువ ప్రాధాన్యత కలిగిన నమీబియా లాంటి చిన్న దేశాలు 124వ స్థానంలో నిలిచి మనల్ని అధిగమించడం విశ్లేషకులను సైతం విస్మయానికి గురిచేస్తోంది.

### మొబిలిటీలో 135వ స్థానం

ప్రయాణ సౌలభ్యం విషయంలో మన పరిస్థితి మరింత అధ్వానంగా ఉంది. ఓవరాల్ ర్యాంక్ 125గా ఉన్నప్పటికీ కేవలం మొబిలిటీ పరంగా చూస్తే మన స్థానం 135 వరకు ఉంది. వీసా రహిత ప్రయాణాలు లేకపోవడంతో భారతీయులు ఇతర దేశాలకు వెళ్లాలంటే నిబంధనల చిక్కుల్లో పడాల్సి వస్తోంది. వీసా కోసం పడే తిప్పల వల్ల సమయం, డబ్బు వృథా కావడమే కాకుండా వ్యాపార అవకాశాలు సైతం దెబ్బతింటున్నాయి.

### అక్రమ వలసలే ప్రధాన కారణం

మన పాస్‌పోర్ట్ విలువ తగ్గడానికి అక్రమ వలసలు ప్రధాన కారణమని విశ్లేషకులు చెబుతున్నారు. ఉపాధి కోసం వెళ్లిన వారు నిబంధనలకు విరుద్ధంగా అక్కడే ఉండిపోవడం, ఓవర్ స్టే చేయడం వంటి చర్యలు మన పౌరులపై ఉన్న నమ్మకాన్ని అంతర్జాతీయంగా దెబ్బతీశాయి. భద్రతా కారణాల దృష్ట్యా కొన్ని దేశాలు మన వీసా పాలసీలను కఠినతరం చేశాయి. దౌత్యపరమైన ఒత్తిళ్లు కూడా మన ప్రయాణ స్వేచ్ఛను అడ్డుకుంటున్నాయి.

### జీవన ప్రమాణాల్లో కొంత మెరుగు...

అయితే జీవన ప్రమాణాల విషయంలో కొంత సానుకూలత కనిపిస్తోంది. క్వాలిటీ ఆఫ్ లైఫ్ అంశంలో మనం 118వ స్థానంలో ఉన్నాం. ఇది దేశంలో మౌలిక వసతులు మెరుగుపడుతున్నాయనడానికి ఒక సంకేతం. కానీ ఆర్థిక స్థిరత్వం, స్వేచ్ఛా వాణిజ్యం ఉన్న దేశాలే టాప్ 10లో రాజ్యమేలుతున్నాయి. సింగపూర్, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, జపాన్ వంటి దేశాలు అగ్రస్థానంలో నిలవడానికి ఆ దేశాల ఆర్థిక క్రమశిక్షణే కారణం. సింగపూర్ పాస్‌పోర్ట్ ర్యాంకింగ్‌లో టాప్ వన్ లో ఉంది.

### బాధ్యతాయుతంగా వ్యవహరించడం కీలకం

ప్రభుత్వం ఇమ్మిగ్రేషన్ సమస్యలను తగ్గించడానికి ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ డిజిటలైజేషన్ మాత్రమే సరిపోదు. విదేశాల్లో మన పౌరులు బాధ్యతాయుతంగా వ్యవహరించడం, దౌత్య చర్చల ద్వారా వాణిజ్య ఒప్పందాలను పెంచుకోవడం అత్యవసరం. మన పాస్‌పోర్ట్ విలువ పెరగాలంటే అది కేవలం ప్రభుత్వ నిర్ణయాలపైనే కాదు ప్రతి భారతీయుడి ప్రవర్తనపై కూడా ఆధారపడి ఉంటుంది.

### పాస్‌పోర్ట్ పవర్ మెరుగుపడాలి...

పాస్‌పోర్ట్ అనేది కేవలం ఒక పేపర్ బుక్‌లెట్ కాదు, అది ప్రపంచ వేదికపై మన దేశ ప్రతిష్టకు చిహ్నం. అంతర్జాతీయంగా పెట్టుబడులు పెరగాలన్నా, పర్యాటక రంగం బాగుపడాలన్నా మన పాస్‌పోర్ట్ పవర్ మెరుగుపడాలి. వ్యవస్థాగత మార్పులు, దౌత్యపరమైన పారదర్శకతతోనే మనం మళ్లీ గ్లోబల్ లీగ్‌లో టాప్ పొజిషన్‌కు చేరుకోగలం.